# మన(సు)లో మాట

పాఠక మహాశయులకు సంఘమిత్ర సంపాదక వర్గం సర్వజిత్తు ఉగాది శుభాకాంక్షలు. గత సంచికలోని నవ్వితే నవ్వండి!, 'మీకు తెలుసా?'లో శక్తి కేంద్రాల గురించి, నా స్మృతి పథంలో ఒక రోజు, ఆంధ్రవైభవము, 'తథాస్తు దేవతలు' శీర్షికలు, ముఖచిత్రం, మీకు నచ్చినందుకు సంతోషం.

వ్యయ నామ సంవత్సరము పాఠకులందరికీ సుఖసంతోషములను నింపిందని ఆశిస్తూ, క్రొత్త సంవత్సరము (సర్వజిత్తు నామ సంవత్సరము) కూడా అందరికీ సుఖసంతోషములను, భోగ భాగ్యములను పంచగలదని ఆకాంక్షిస్తున్నాము. బాలమిత్రలో ఈ సారి పిల్లల కోసం కథను ప్రవేశపెట్టడం జరిగింది. అనివార్య కారణముల వలన ఈసారి 'చరిత్రకెక్కిన చరితార్థులు' అందించలేక పోతున్నాము. వచ్చే సంచికలో తిరిగి ఈ శీర్షిక తిరిగి ప్రచురించబడుతుంది. ఈ సంవత్సరములో సంఘమిత్ర మరొక్క అడుగు ముందుకు వేసి ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు గణితము బోధించు కార్యక్రమమునకు శ్రీకారం చుట్టింది. ఈ సంవత్సరము పలు కుటుంబములు కలసి వనవిహారము మరియు వనభోజన కార్యక్రమములు ఏర్పాటు చేసుకునే ఆలోచన చేస్తున్నాము. ఈ సందర్భముగా మనము చిన్ననాడు నేర్చుకున్న ఆటలు, పాటలు మన భావి తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నాం! ఇందులో పెద్దవాళ్ళకు, పిన్నలకు కొన్ని పోటీలు ఏర్పాటు చేసి, గెలిచిన వారికి బహుమతులు అందించే ఆలోచన చేస్తున్నాం. ఈ విధముగా సంఘమిత్రకు ప్రోత్సాహమును ఇస్తున్న అందరికీ ధన్యవాదములు.

మన చుట్టుప్రక్కల విశేషమైన ప్రజ్ఞాపాటవములు కలిగిన బాలురు, బాలికలు ఎందరో ఉన్నారు. వారిని ప్రోత్సహించడం ఎంతైనా అవసరం. మీరు చేయవలసినదల్లా వారి వివరములు, వారి ప్రజ్ఞాపాటవాలను తెలియజేస్తూ ఒక పేజీకి మించకుండా రాసి పంపిస్తే (ఫొటో కూడా పంపవచ్చు), సంఘమిత్రలో ప్రచురిస్తాము. 'పుట్టినరోజు శుభాకాంక్షలను పత్రికాముఖముగా తెలియజేయవచ్చా?' అని చాలా మంది అడుగుతున్నారు. పాఠకుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, దీని కోసం ఒక పేజీని కేటాయిస్తున్నాం. వీటిని డిశంబరు, మార్చి, జూన్, సెప్టెంబరు నెలలలో 10వ తేదీలోగా పంపితే, వాటిని వరుసగా సంక్రాంతి, ఉగాది, జులై, విజయదశమి సంచికలలో ప్రచురిస్తాము. వీటిని ప్రచురించడం లేదా ప్రచురించకపోవడం విషయంలో తుది నిర్ణయం సంపాదకునిదే.

మళ్ళీ జులై సంచికలో కలుద్దాం! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.